andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్టం 39.6, కనిష్టం 28.4

కామారెడ్డి
జిల్లా వార్తలు

5

మంగళవారం 20 మే 2025



నేటి నుంచి టీచర్లకు శిక్షణ తరగతులు

పెద్ద కొడపగల్, మే 19 (ఆంధ్రజ్యోతి): పెద్దకొడప్‌గల్ ఉన్నత పాఠశాలలో 20వ తేదీ మంగళవారం నుంచి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు వృత్తాంతర శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంఈవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ శిక్షణ తరగతులు ఐదు రోజుల పాటు కొనసాగుతున్నందున ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. ఈ శిక్షణలో ఉపాధ్యాయుల హాజర ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారని, ఉపాధ్యాయులు సకాలంలో శిక్షణకు హాజరు కావాలని సూచించారు.



'యువ వికాసం'.. వడివడిగా!

- కొనసాగుతున్న యువ వికాస్ దరఖాస్తుల పరిశీలన
- ఇప్పటికే బ్యాంకర్లకు లక్ష్యాలను నిర్దేశించిన జిల్లా అధికారులు
- 50 శాతం విచారణ పూర్తి చేసిన బ్యాంకర్లు
- దరఖాస్తుదారుల వ్యక్తిగత సిబిల్ స్కోర్ పరిశీలన
- ప్రత్యేక కమిటీల ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక
- జూన్ 2న రుణాలు ఇచ్చేలా ప్రణాళిక
- జిల్లాలో యూనిట్ల లక్ష్యం 13,450.. వచ్చిన దరఖాస్తులు 44,631

కామారెడ్డి, మే 19(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాస్ పథకానికి వివిధ కార్పొరేషన్ల కింద దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హుల జాబితాను రూపొందించడానికి సంబంధిత శాఖల అధికారులతో మండల, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 50 శాతం వరకు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశారు. పరిశీలించిన దరఖాస్తులను సంబంధిత శాఖ పర్యవేక్షణలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హులను ఎంపికచేయనున్నారు. జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఇటీవల సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి అర్హులందరికీ ఈ పథకంతో లబ్ధి చేకురే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అయితే ఇది వరకే యువ వికాస్ లక్ష్యాలను ఆయా బ్యాంకర్లకు కేటాయించారు. దీంతో బ్యాంకర్లు లక్ష్యాలకు అనుగుణంగా వచ్చిన దరఖాస్తుదారులకు సిబిల్ స్కోర్ ఎలా ఉంది, రుణాలు ఇస్తే సకాలంలో చెల్లిస్తారా? అనే దానిపై బ్యాంకర్లు విచారణ చేపడుతున్నారు.



● బ్యాంక్‌లో దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన

జిల్లాలోని 535 గ్రామ పంచాయతీలు, మూడు మున్సిపాలిటీల పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకానికి 44,631 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో కార్పొరేషన్‌ల వారిగా చూస్తే ఎస్సీ కార్పొరేషన్‌కు 8335 దరఖాస్తులు రాగా, ఎస్టీ కార్పొరేషన్‌కు 4,580 దరఖాస్తులు రాగా, బీసీ కార్పొరేషన్‌కు 23,946 ఈబీసీ, ఈడబ్ల్యుఎస్‌కు 1046, ముస్లిం మైనార్టీ 6663, క్రిస్టియన్ మైనార్టీలకు 116 దరఖాస్తులు వచ్చాయి. అంతేకాకుండా జిల్లాలో ప్రస్తుతం రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది.

యూనిట్ల లక్ష్యం 13,450

జిల్లాలోని జనాభా ప్రతిపాదికన కులాల వారీగా రాజీవ్ యువ వికాస్ పథకానికి యూనిట్లను ప్రభుత్వం కేటాయించింది. జిల్లావ్యాప్తంగా 13,450 యూనిట్ల లక్ష్యం. ఇందులో ఎస్సీ కార్పొరేషన్ యూనిట్ల లక్ష్యం 4104, ఎస్టీ కార్పొరేషన్ యూనిట్ల లక్ష్యం 2366, బీసీ యూనిట్లు 4698, ఈబీసీ, ఈడబ్ల్యుఎస్ యూనిట్లు 1271, ముస్లిం మైనార్టీ యూనిట్లు 977, క్రిస్టియన్ మైనార్టీ యూనిట్లు 44గా ప్రభుత్వం కేటాయించింది. పథకంలో రూ.50 వేలు, రూ.లక్ష, రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలు రుణాలు అందిస్తుండగా రూ.50 వేలకు వందశాతం సబ్సిడీ రాయితీ, రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు 90 శాతం సబ్సిడీ, రూ.లక్ష నుంచి 2లక్షల వరకు 80 శాతం సబ్సిడీ, రూ.2 లక్షల నుంచి 4 లక్షల వరకు 70 శాతం సబ్సిడీ ప్రభుత్వం అందించనుంది.

సిబిల్ స్కోర్‌పై బ్యాంకర్ల విచారణ


రాజీవ్ వికాస్ పథకానికి వచ్చిన దరఖాస్తులను ఇప్పటికే ఆయా బ్యాంకర్ల పరిశీలనకు పంపారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటిని బ్యాంకర్లు పరిశీలిస్తున్నారు. ఈనెల చివరికల్లా బ్యాంకర్లు పరిశీలనను పూర్తిచేసేలా కార్యాచరణను రూపొందించారు. దరఖాస్తుదారులకు కేటాయించిన బ్యాంక్‌లలో రుణ బకాయిలు ఉన్నాయా? లేదా? అన్ని పరిశీలించనున్నారు. ప్రధానంగా సిబిల్ స్కోర్‌ను తనిఖీ చేసిన తర్వాతే మెరుగ్గా ఉంటేనే ఆమోదం తెలుపనున్నారు. ఆ దరఖాస్తుదారులకే రుణం మంజూరు చేసే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా మండల పరిధిలో గల బ్యాంక్‌ల వారీగా రుణాలు మంజూరు చేయాల్సిన లక్ష్యాలను జిల్లా యంత్రాంగం నిర్దేశించింది. అంతేకాకుండా దీనికి అనుగుణంగా బ్యాంక్ లు రుణాలు మంజూరు చేసేలా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంకర్లతో చర్చలు జరిపారు.

జిల్లా, మండల కమిటీల పర్యవేక్షణలో..

పట్టణ పరిధిలో మున్సిపల్ కమిషనర్, మండల స్థాయిలో ఎంపీడీవో కన్వీనర్‌గా మండల ప్రత్యేకాదికారి, సంబంధిత కార్పొరేషన్‌కు చెందిన అధికారి, డీఆర్‌డీవో నుంచి ఒకరిని సభ్యుడిగా నియమించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ కన్వీనర్‌గా వివిధ శాఖల అధికారులతో పాటు బ్యాంకు అధికారి సభ్యుడిగా ఉంటారు. గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తులను పరిశీలిస్తారు. దరఖాస్తుదారులు గతంలో ఐదేళ్లుగా కార్పొరేషన్ల నుంచి ఏదైనా రుణం పొందారా? ఆ కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారా? వారి ఆర్థిక పరిస్థితిని పరిశీలించి మండల కమిటీకి పంపిస్తారు. అక్కడ నుంచి ఆయా దరఖాస్తులను జిల్లా కమిటీకి పంపిస్తారు. ఇలా కమిటీల పర్యవేక్షణలో లబ్ధిదారుల జాబితాను తయారుచేయనున్నారు.

ఇన్‌చార్జి మంత్రి ఆమోదం తర్వాతే..

ఈ పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చివరగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతోనే జరగనుంది. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయిలో పరిశీలన అనంతరం దరఖాస్తులను ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతోనే లబ్ధిదారుల ఎంపిక తుది జాబితాను ఏర్పాటు చేయనున్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు జూన్ 2న రాయితీ రుణాలను అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దరఖాస్తుల పరిశీలన 50 శాతం పూర్తయినందున మరో వారం రోజుల్లో మిగితా దరఖాస్తుల పరిశీలన పూర్తవుతుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.





నియామక పత్రాలను అందిస్తున్న ఎస్పీ

కారుణ్య నియామకాల్లో భాగంగా ఇద్దరికి పత్రాల అందజేత

కామారెడ్డి టౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాల్లో భాగంగా సోమవారం ఇద్దరికి నియామక పత్రాలను ఎస్పీ రాజేష్‌చంద్ర అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండునెలల క్రితం విధి నిర్వహణలో రోడ్డుప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ వడ్ల రవి మరణించాడని అతని భార్య సౌఖ్యకు, అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రమేష్ కుమార్తె మానసకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ నియామక పత్రాలను అందించినట్లు తెలిపారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు విడతల వారిగా కారుణ్య నియామకాలలో ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ నరసింహరెడ్డి, ఏవో అప్సర్, సూపరింటెండెంట్‌లు గంగాధర్, జామీల్ అలీ, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల యజమానులతో మాట్లాడుతున్న ఆర్టీవో

బస్సు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : ఆర్టీవో

కామారెడ్డి టౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): పాఠశాలల బస్సు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్టీవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్టీవో కార్యాలయంలో జిల్లాలోని విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలలో జిల్లాలో స్కూల్ బస్సు ప్రమాదాలు తక్కువగా జరిగాయని తెలిపారు. ఈ సంవత్సరం స్కూల్ బస్సు ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లు, యాజమాన్యం తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. స్కూల్ వద్ద పిల్లలు రోడ్డు దాటినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని,స్కూల్ బస్సులను తగిన మరమ్మతులు చేసుకుని ఫిట్‌నెస్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వాహన తనిఖీ అధికారులు, సహాయక మోటార్ వాహన తనిఖీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

శ్రీసిద్ధరామేశ్వర ఆలయంలో భక్తుల సందడి

భిక్కనూరు, మే 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీసిద్ధరామేశ్వర ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జామున నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని మూలబావి వద్ద స్నానాలు ఆచరించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా స్వామివారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని బోజన శాలలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమా న్ని నిర్వహించారు.



యాడారంలో మొక్కలను నాటి నీరు పోస్తున్న కలెక్టర్ ఆశీస్ సాంగ్వాన్



ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులను స్వీకరిస్తూ..

ఆయిల్‌పాం సాగుపై అవగాహన పెంచుకుని..

అధిక దిగుబడులు సాధించాలి

● కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ● యాడారంలో ఆయిల్‌పాం సాగుపై అవగాహన సదస్సు ● 'ప్రజావాణి'లో ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్

బీబీపేట, మే 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ఆయిల్‌పాం సాగుపై రైతులు అవగాహన కల్పించుకుని, సాగు చేస్తూ అధిక దిగుబడులను సాధించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం బీబీపేట మండలం యాడారం గ్రామంలో ఆయిల్ పాం సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని రైతులు వరిపంటకు బదులు ఆయిల్ పాం సాగు చేసి అధిక దిగుబడితో పాటు అధిక సొమ్ము సంపాదించవచ్చని తెలిపారు. ఆయిల్‌పాం సాగులో లేబర్ ఖర్చు తక్కువ అని, డ్రిప్ ఇరిగేషన్‌తో సాగు చేయవచ్చని, దిగుబడి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం జిల్లా ఉద్యాన వన శాఖాధికారి జ్యోతి మాట్లాడుతూ ఆయిల్‌పాం ఒక ఎకరానికి 4,200 సబ్సిడీ రూపంలో నాలుగు సంవత్సరాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. డ్రిప్ కూడా ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, పెద్ద రైతులకు 80 శాతం సబ్సిడీలో ఇవ్వడం జరుగుతుందని వివరించారు. హిందూ యానిలివర్ మల్టీనేషనల్ కంపెనీ నుంచి వచ్చిన వరుణ్, విజయ రామస్వామి కచ్చితంగా మన జిల్లాలో ఆయిల్‌పాం ఫ్యాక్టరీ నిర్మించడానికి కసరత్తు చేస్తున్నామని రైతులు ఆయిల్ పాం సాగు చేసుకుని లాభాలు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, కంపెనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

● 'ప్రజావాణి'కి మొత్తం 96 దరఖాస్తులు

కామారెడ్డి టౌన్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. భూముల సమస్యలు, రెండు పడకల గదుల ఇళ్లు మంజూరు, రైతు భరోసా, పింఛన్ల మంజూరు, తదితర అంశాలపై మొత్తం 96 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆయాశాఖల అధికారులు సాధ్యాసాధ్యాల మేరకు సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో పేలుడు పదార్థాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

భవానిపేటలో పేలుడు పదార్థాలు లభ్యం

● పొలంలో బండరాళ్లు పేల్చేందుకు అమర్చిన జిలెటిన్‌స్టిక్స్
● బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు

లింగంపేట, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని భవానిపేటలో సోమవారం పోలీసులు 31జిలెటిన్ స్టిక్స్‌ను స్వాదీనం చేసుకున్నారు. ఆదివారం దర్శనం సాయిలు తన వ్యవసాయ భూమిలో బండరాళ్లను పేల్చేందుకు జిలెటిటిన్ స్టిక్స్‌ను ఉపయోగించాడు. దీంతో బండరాళ్లు గ్రామంలోని బిట్ల పోషెట్టి, ఆర్ల పోచయ్య, బిట్ల సాయిలుల ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆర్ల పోచయ్యకు చెందిన బైక్ ధ్వంసమైంది. దీంతో గ్రామస్తులు పోలీసులకు పిర్యాదు చేయడంతో విషయం బయటకు వచ్చింది. సోమవారం ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు, ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్, లింగంపేట్ ఎస్సై వెంకట్‌రావులు సంఘటన స్థలానికి చేరుకుని పొలంలో డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీ చేయగా 31జిలెటిన్ స్టిక్స్ బండరాళ్లను పేల్చేందుకు అమర్చారు. వాటిని బాంబ్ స్క్వాడ్ బృందం నిర్వీర్యం చేసి 31జిలెటిన్ స్టిక్స్‌ను స్వాదీనం చేసుకున్నారు. దీంతో భవానిపేట గ్రామస్తులు పోలీసుల పని తీరుపట్ల హర్షం వ్యక్తం చేశారు.



ట్రాక్టర్‌ను సీజ్ చేసిన పోలీసులు

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

- జూన్ 12 వరకు కార్యక్రమం
- జిల్లాలోని 6 మండలాల్లో రైతులకు అవగాహన
- ఇప్పటికే రెండు మండలాల్లో అవగాహన కార్యక్రమాలు పూర్తి
- 22న కామారెడ్డి మండలం లింగాపూర్‌లో కార్యక్రమం చేపట్టనున్న అధికారులు
- మెరుగైన సాగు పద్ధతులపై రైతులకు సూచనలు

కామారెడ్డి టౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న రాష్ట్రంలోని రైతులను అన్నిరకాలుగా ఆదుకోవాలని, రైతులు చేస్తున్న చిన్నచిన్న తప్పిదాలతో పంట దిగుబడి తగ్గిపోవడంతో పాటు చీడపీడల భారిన పంటను పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం రూపొందించింది. మరో నెలన్నరలో వానాకాలం సాగుకు రైతులను సమాయత్తం చేసేందుకు ఇప్పటినుంచే రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించి రైతులకు మేలు చేకురేలా ప్రణాళికలు రచించింది..ఈ నేపథ్యంలో మెరుగైన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లా వ్యవసాయశాఖ జిల్లాలోని ఆరు మండలాలను ఎంపికచేసింది. అయితే, జూన్ 12 వ తేదీ వరకు రైతుముంగిట్లో శాస్త్రవేత్తల పేరిట కార్యక్రమం నిర్వహణకు శ్రీకారం చుట్టింది. పంటలపై తెగుళ్ల దాడిని ముందే అరికట్టి దిగుబడి పెంచి అన్నదాతకు ఆర్థిక తోడ్పాటును కల్పించేలా అడుగులు వేస్తుంది.

మొదటి విడతలో 6 మండలాలు

రైతులకు పంట సాగులో కలిగే ఇబ్బందులపై, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, పంటలకు చీడపీడలు పట్టినప్పుడు ఏం చేయాలనే దానితో పాటు తదితర అంశాలను వివరించనున్నారు. ఇందుకు గాను జిల్లాలో మొత్తం 6 మండలాలను ఎంపిక చేశారు. అందులో ఇప్పటికే ఈనెల 8న తాడ్వాయి మండలం ఎర్రపహాడ్, ఈనెల 15 న లింగంపేట మండలం మోతె గ్రామంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ నెల 22 న కామారెడ్డి మండలం లింగాపూర్ గ్రామంలో, 29 న సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలో, జూన్ 05 న నిజాంసాగర్ మండలం గోర్గల్‌లో, 12 న నాగిరెడ్డిపేట మండలం పోచారంలో రైతు సమావేశాలు ఏర్పాటుచేసి యూరియా వాడకం, సాగుఖర్చుతగ్గించుకోవడం,భూసారం కాపాడడం, విత్తన,పురుగులమందు కొనుగోలు, రశీదులు భద్రపరచడం, సాగునీటి ఆదా, పంట మార్పిడి పద్ధతులు, సుస్థిర ఆదాయం, చెట్లపెంపకం, పర్యవరణ పరిరక్షణ తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు.



మోతెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు



తాడ్వాయి మండలం ఎర్రపహాడ్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

నిర్దేశిత గ్రామాల్లో అవగాహన

జిల్లావ్యాప్తంగా లక్షల ఎకరాలలో వ్యవసాయభూములు ఉండగా ఏటా దాదాపు 4 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. జిల్లాలో అధికంగా రైతులు వరిసాగు చేస్తున్నారు. నారుపోసిన నాటి నుంచి వరికోతకు వచ్చేవరకు పలు రకాల తెగుళ్లు పంటలపై దాడి చేస్తున్నాయి. వాటి నివారణకు రైతులు లెక్కకు మించి పురుగుల మందులు వాడుతున్నారు. దీంతో భూములు విషతుల్యం అవుతున్నాయని భావించిన ఉన్నతాధికారులు వ్యవసాయ శాస్త్రవేత్తలను ముందుగానే పల్లెలకు పంపి రైతులకు పంట సాగుబడిపై సలహాలు, సూచనలు ఇవ్వాలని నిర్ణయించారు. పంటల సాగు ప్రారంభం కాకముందే అవగాహన కల్పించేందుకు 40 రోజుల పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు గ్రామాల్లో పర్యటిస్తున్నారు.

అవగాహన కార్యక్రమాలను రైతులు వినియోగించుకోవాలి

: తిరుమలప్రసాద్, డీఏవో, కామారెడ్డి

జిల్లాలోని 6 మండలాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఈనెల 8 నుంచి జూన్ 12 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇప్పటికే తాడ్వాయి, లింగంపేటలో విజయవంతంగా పూర్తిచేశాం. మిగిలిన నాలుగు మండలాల్లోని ఆయా గ్రామాలలో సైతం రైతులకు అవగాహన చేపట్టనున్నాం. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని యూరియా వాడకం, సాగుఖర్చుతగ్గించుకోవడం,భూసారం కాపాడడం, విత్తన,పురుగులమందు కొనుగోలు, రశీదులు భద్రపరచడం తదితర అంశాలను తెలుసుకోవాలి.

వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్,మే19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని విద్యార్థుల ఉత్తీర్ణత శాతంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశంతో పాటు ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో బోధన్ మండలంలోని పెంటాకలాన్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో మొత్తం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. దీంతో మొదటి, ద్వితీయ ర్యాంకు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో విద్యార్థులందరు ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు ప్రైవేటుకు దీటుగా అన్ని వసతులు కల్పిస్తున్నామని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్బయ్య, ఉపాధ్యాయులు పాటల శ్రీనివాస్, విద్యార్థిని, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మూడు బుల్లెట్ వాహనాల సైలెన్సర్ తీసివేత

బోధన్‌రూరల్,మే19(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో సౌండ్ పొల్యూషన్ చేస్తూ తిరుగుతున్న మూడు బుల్లెట్ వాహనాలను పట్టుకుని సైలెన్సర్‌లను రిమ్యూ చేసి ఫైన్ వేయడం జరిగిందని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. సౌండ్ పొల్యూషన్ చేస్తున్న వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బుల్లెట్ వాహనాలను అధిక సౌండ్‌తో నడిపిస్తే కఠిన చర్యలతో పాటు జరిమాన విధించడం జరుగుతుందన్నారు.

రైతులు పంట మార్పిడిని పాటించి సుస్థిర ఆదాయాన్ని పెంపొందించుకోవాలి

● కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త స్వప్న

రెంజల్,మే19(ఆంధ్రజ్యోతి):రైతులు కాలానికి అనుగుణంగా పంటలను పండించుకోవాలని, ఒకే రకమైన పంటలు కాకుండా పంట మార్పిడి వల్ల రైతు సుస్థిర ఆదాయాన్ని పెంపొందించుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త స్వప్న అన్నారు.సోమవారం మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రుద్రూరు వ్యవసాయశాస్త్రవేత్త బీవీరాజ్‌కుమార్, వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు,మండల పశువైద్య అధికారివిఠల్, మాజీ సొసైటీ చైర్మన్ సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సయ్య, ఏఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

మగ్గిడిలో ముగిసిన వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం

ఆర్మూర్ రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం మగ్గిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గత 20 రోజులుగా నిర్వహించిన వేసవికాల వాలీబాల్ శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ముఖ్య అతిథులుగా హాజరైనా ఎంఐఐ వివేకానంద రెడ్డి, ఆదిలాబాద్ ఆర్టీఏ డిప్యూటీ కమీషనర్ రవీందర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొని రాష్ట్ర జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించాల న్నారు. పాఠశాల స్థాయినుంచి ఇష్టమైన క్రీడను ఎంచుకొని అందులో రాణించేందుకు సాధన చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో కే. శ్రీనివాస్‌రెడ్డి, ఉమమహేశ్వర్‌రావు,శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్‌ను సన్మానం

వేల్పూర్, మే 19(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌ను బీఆర్ఎస్, బీజేపీ, పార్టీ నా యకులతో పాటు స్థానిక వీఆర్ఏలు, పాస్టర్లు సన్మానించారు సోమవారం తహసీల్దార్ శ్రీకాంత్‌ను ఆయన చాంబర్‌లో ఆయా పార్టీలకు చెందిన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రేగుల్ల రాములు, సామ మహిపాల్, కొంతం దేవన్న, పెద్దమల్లారెడ్డి, బబ్బురు ప్రతాప్‌రెడ్డి, మిట్టపల్లి మహిపాల్, బాల్‌రాజ్, పిట్లసత్యం, హన్మాంత్‌రెడ్డి, మహేష్, సుంకరి రాము, సృజన్, బీజేపీ పడిగెల రవి, జాన్కంపేట్ పాస్టర్ నేవా, గంగారెడ్డి, వివిధ గ్రామాల వీఆర్ఏలు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని దుకాణదారులకు జైలు

బోధన్‌రూరల్,మే19(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో రాత్రి సమయంలో నిర్దేశించిన సమయానికి మించి హోటల్, షాపులు తెరిచి ఉంచి నడపడంతో సదరు యాజమానులకు సోమవారం కోర్టు న్యాయమూర్తి శేష తల్ప సాయి ముందు హాజరుపర్చగా ఇద్దరు దాబా యాజమానులకు, ఇద్దరు టీ షాప్ యాజమానులకు, ఒక టీ పాన్ యాజమానికి రెండు రోజుల జైలుశిక్ష విధించడం జరిగిందన్నారు. మరొకరికి తాగి వాహనం నడిపిన ఒక వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష విధించడం జరిగిందన్నారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హోటళ్ల, దాబాలు మూసి వేయాలని లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

జులై 15 వరకు ఎత్తిపోతల పనులు పూర్తిచేయాలి

మాక్లూర్, మే 19(ఆంధ్రజ్యోతి): బొంకంపల్లి, ముల్లంగి లిఫ్ట్ పనులను జులై 15వ తేదీ వరకు పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు కోరారు. సోమవారం మండలంలోని బొంకంపల్లి, ముల్లంగి లిఫ్ట్ పనులను లక్మాపూర్ వద్ద రైతులతో కలిసి ఎత్తిపోతల పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విఠల్‌రావు, అంజయ్యతో పాటు రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ శ్రీరామ రక్ష : సీఐ

కోటగిరి,మే19(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు నడిపే వ్యక్తులకు హెల్మెట్ శ్రీరామ రక్ష అని రుద్రూరు సీఐ కృష్ణ పేర్కొన్నారు. రుద్రూరు మండల కేంద్రంలో సోమవారం హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపే వ్యక్తులు హెల్మెట్ తప్పనిసరి ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే హెల్మెట్ ప్రాణాలు కాపాడుతుందని ఆయన పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానాలు విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సాయన్న పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో సహస్త్ర కళశాభిషేకోత్సవం



1001కలశాలతో ఆలయంలో ప్రత్యేక పూజలు

బోధన్‌రూరల్,మే19(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో పుష్కర వార్షిక బ్రహ్మోత్సవాలు 13న ప్రారంభమై సోమవారంతో ముగిశాయి. వేద పండితులు గోవర్ధనం రాఘవ చారి నేతృత్వంతో రామాచారి, సురేష్ ఆచారిలతో పలువురు వేద పండితులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1001కలశములచే ఆలయ ప్రాంగణంలో నుంచి భక్తులచే కలశములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1001కలశములచే, భక్తులతో ఆలయం కిటకిటలాడింది. గోవిందా నామస్మరణతో సకల శుభాలు కలుగుతాయని పేర్కొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వామపక్షనాయకులు



మెండోరలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ఎడపల్లి, మే19(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం ఎడపల్లి మండల కేంద్రంతోపాటు నెహ్రూనగర్, అంబం గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొరకు ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజల అభ్యున్నతిని మరిచిందని, రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల హామీల అమలులో భాగంగా ఇళ్లు లేని నిరుపేదల సొంతింటి కల నిజం చేయడానికి స్థలం ఉండి ఇళ్లు లేని నిరుపేదలు ఇళ్లు కట్టుకోడానికి పూర్తి సబ్సిడీతో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా 5 లక్షల రూపాయలను అందిస్తుందన్నారు. చిన్నవారికి ఇండ్లు లేని వారికి ఇండ్లు కట్టియ్యాలనే ఉద్దేశ్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. స్థలం ఉండి ఇండ్లు లేనివారికి మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని, ముగ్గు పోస్తేనే స్కీము వర్తిస్తుందన్నారు. గతంలో బేస్‌మెంట్ లెవల్ వరకు కట్టిన వారికి ఈ పథకం వర్తించదని, ఇప్పుడు ముగ్గు పోస్తేనే వర్తిస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తొందరగా ఇంటి నిర్మాణం చేపట్టాలనే ఉద్దేశంతో డ్వాక్రా గ్రూపు మహిళలకు డ్వాక్రా గ్రూపు ద్వారా 50 నుండి 75 వేల వరకు రుణం మంజూరు చేయాలని అధికారులకు సూచించడం జరిగిందన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా లోను తీసుకుని త్వరగా బేస్‌మెంట్ వరకు కట్టుకుంటే హౌసింగ్ శాఖ నుంచి లక్ష రూపాలయలు ఇస్తారని, వెంటనే ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టే లబ్దిదారులకు ఇసుక, మొరం ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని, ప్రభుత్వానికి ఎలాంటి రుసుము కట్టవద్దని, తరలించే వారికి మాత్రమే డబ్బులు ఇవ్వాలన్నారు. మంజూరు అయిన ప్రతి ఒక్కరు అధికారులు సూచించిన విధంగా ఇళ్లు కట్టుకోవాలన్నారు. మొదటి విడతగా మండలంలో 350 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని రెండవ విడతలో అర్హత కలిగిన వారికి ఇంకా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో మాదిరి ప్రభుత్వ పథకాల మంజూరు కోసం ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరి కొరకు మధ్యవర్తులు ఎవరైనా డబ్బులు అడిగితే వారిపై చర్యలుంటాయన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బిల్లా రాంమోహన్, మండల పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్, ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రేయ, ఎంపీడీఓ శంకర్, ఆయా గ్రా మాల పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాస్, పార్టీ నాయకులు బం జ కామప్ప, బొబ్బిలి శ్రీనివాస్, తూట్కూర్ రవీందర్ రెడ్డి, కంచరి శ్రీనివాస్, యాసాడ రాజ్ కుమార్, ఇందిమ్మ ఇండ్ల లబ్దిదారులు తదితరులు ఉన్నారు.

బోధన్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం అర్హత కలిగిన పేద ప్రజలకు కేటాయించాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం బోధన్ కార్యదర్శి శంకర్ గౌడ్ మాట్లాడుతూ మండలంలోని బండారుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను చాలామంది కట్టుకోవడానికి సిద్ధంగా ఉన్న పేద ప్రజలకు లబ్దిదారులుగా ఎంపిక చేయాలని వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ వహీద్, శారద, సాయిలు, మాధవరావు, కాశీ, గోపి తదితరులున్నారు.

మాక్లూర్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా సోమవారం మండలంలోని ధర్మోరా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి విండో చైర్మన్ భూరోల్ల అశోక్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతీ లబ్ధిదారుడు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మారెడ్డి, ఎంపీవో శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మెండోర: నిరుపదలకు అండగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. సోమవారం మెండోర, వెల్కటూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. బుస్సాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఒక అద్భుతమైన ఘట్టమని నిరుపేదలకు అండగా ఇందిరమ్మ ఇళ్ల పథకం, ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపదలకు అభయహస్తం ఇందిరమ్మ పథకమని పేర్కొన్నారు. నిరుపేదలకు అండగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ఉంటుందని ఆర్థిక స్థోమత లేక నిరుపేదల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఇల్లు లేని నిరుపేద అర్హులందరికీ ఈ పథకం వర్తింపజేయాలని ప్రజా పాలనలో నిమోదు చేసుకున్న అర్హులందరికీ ముందుగా ఇండ్లు ఇస్తామని దశల వారిగా గూడులేని నిరుపేదల సొంత ఇంటి కల నెరవేర్చడం తమ ప్రభుత్వ సంకల్పమని అన్నారు. ఈ కార్యక్రమంలో సోం రాజేందర్, బద్దీ సాయి, గుండోజీ రవి, బద్దం అశోక్, ఆశమ్మ, లక్ష్మీ, భూమేష్, సుమన్, శ్రీనివాస్, సాయరెడ్డి, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ఎమ్మెల్యే సహకారంతో బోధన్ నియోజకవర్గంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతున్నాయని సాలూర మండల అధ్యక్షులు మందర్నా రవి అన్నారు. సోమవారం సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంప్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్దిదారుల ఇళ్ల నిర్మాణానికి ముగ్గులు వేసి భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాలూర మండల తహసీల్దార్ శశిభూషణ్, నాయకులు చీల శంకర్, అల్లె జనార్ధన్, నర్సింహ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలో పలు వార్డుల్లో ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల ఇంటి నిర్మాణం కోసం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మున్సిపల్, హౌజింగ్ అధికారుల సమక్షంలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు పోశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పారదర్శకంగా ఇండ్లను మంజూరు చేశామని ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గోపు గంగాధర్, ఏఈ నిఖిల్, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు స్వామి, జేజే నర్సయ్య, పర్స అనంతరావు, నాగేంద్రబాబు, వాక మహేష్, షాదుల్లా, సుంకరి సురేష్, సతీష్, కిరణ్, నల్లూరి శ్రీనివాస్, మొండి దినేష్, ప్రేమ్, విశాల్, సాయిబాబా, మహేష్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్:మండలం డీకంపల్లి గ్రామంలో సోమవారం ఇంది రమ్మ ఇళ్లకు ఎంపీడీవో గంగాధర్ మార్కింగ్ చేశారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వెంటనే చేపట్టాలని సూచించారు. మండలంలోనిఅన్ని గ్రా మాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించామన్నారు.ఈకార్యక్ర మంలో పంచాయతీ కార్యదర్శి దినేష్, ఇందిరమ్మ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంతో పాటు మండలంలోని చౌట్‌పల్లి, బసీరాబాద్, అమీర్‌నగర్ గ్రామాలలో లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను సోమవారం కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్ పాలెపు నర్సయ్య, వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, మండ పార్టీ అధ్యక్షుడు సుంకెట రవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్దిదారులు తమ ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడిగెల ప్రవీణ్, కస్తూరి శ్రీనివాస్, శ్రీరాముల మురళి, దేవేందర్, బచ్చిమల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాలతో పంట పొలాలు సారవంతం

● డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

వేల్పూర్, మే 19(ఆంధ్రజ్యోతి): రైతులు జీలుగ విత్తనాలను వరి పొలంలో వేసుకోవడం వల్ల పంట భూములు సారవంతంగా పంట భూములు సారవంతంగా మార్చుకోవాలని డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి సూచించారు. సోమవారం వేల్పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపొలం కోసిన తర్వాత వరికొయ్యలను రైతులు తగులబెట్టకుండా ఆ పొలానికి నీరు పారించి అందులో సింగిల్ సూపర్ ఫాస్పేట్ ఎరువును చల్లుకుంటే ఆ వరికొయ్యలు మురిగి పొలానికి మంచి ఎరువుగా తయారవుతాయన్నారు. వరికొయ్యాలను ఎరువు రూపంగా మార్చుకోవాలని కోరారు. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై అందిస్తున్న జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శృతి, సొసైటీ వైస్ చైర్మన్ శ్రీధర్, కార్యదర్శి కృష్ణ డైరెక్టర్లు, సంఘసిబ్బంది, ఏఈఓలు రైతులు పాల్గొన్నారు.

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాంలో ప్రభుత్వం అందించిన 50 శాతం సబ్సిడీ జీలుగు విత్తనాలను సోమవారం రైతులకు అందజేశారు. 30 కిలోల బస్తా 4275 రూపాయల అసలు ధర కాగా ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ద్వారా 2138 రూపాయలకు అందించినట్లు ఏవో లావణ్య తెలిపారు. జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు తమ పట్టాపాస్ బుక్, ఆధార్‌కార్డు, వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఏవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో లావణ్య, ఏఈవో దివ్య, సొసైటీ చైర్మన్ నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు స్వామి, సురేందర్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



ఏర్గట్లలో జిలుగు విత్తనాలను పంపిణీ ప్రారంభిస్తున్న చైర్మన్ నర్సయ్య

మాక్లూర్: మాక్లూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని కల్లెడ గ్రామంలో చైర్మన్ అశోక్ సోమవారం జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈకార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి రాంబాబు, ఏఈవోఉమాదేవి,డైరెక్టర్లు గంగారాం,చిన్నయ్య,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం వద్ద సోమవారం సబ్సిడీపై జిలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చైర్మన్ బర్మచిన్న నర్సయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వార 50 శాతం సబ్సిడితో రూ. 2138/లు చెల్లించి విత్తనాలు తీసుకెళ్లాలని, దీనికై రైతులు తమవెంటపట్టాపాస్ బుక్,ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని కోరారు.ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ సిం గసారం గంగారాం, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కొరిపెల్లి లింగా రెడ్డి, రేండ్ల రాజారెడ్డి, కొలిప్యాక శ్రీనివాస్, ఏవో వైష్ణవ్, సీఈవో శ్రీనివాస్, పాల్గొన్నారు.

బట్టాపూర్‌లో ఘనంగా సంత్‌సేవాలాల్ ఆలయ వార్షికోత్సవ వేడుకలు

ఏర్గట్ల, మే 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బట్టాపూర్ గ్రామంలోని గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహరాజ్ జగదాంబ ఆలయ నాల్గవ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించగా గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బట్టాపూర్ తాండ వాసులు, మహిళలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఆలూర్, మే 19(ఆంధ్రజ్యోతి):ఆలూర్ మండలం మిర్ధాపల్లి గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 36వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరుకు కృషి చేసిన ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వినయ్‌రెడ్డి, నిజాంసాగర్ ప్రాజెక్టు మాజీ చైర్మన్ యాల్లా సాయిరెడ్డి లకు బాధిత కుటుంబం ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు సాయిరెడ్డి, గాదెపల్లి మధు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆశాజ్యోతి కామ్రేడ్ సుందరయ్య



నవీపేటలో సుందరయ్య వర్ధంతి నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

వర్ని,మే19(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు యోధుడు భారత దేశ తొలి పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు దేశ ప్రజలే తమ బిడ్డలుగా భావించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుని యావదాస్తిని పేద ప్రజలకు పంచిన గొప్ప మహనీయుడు కామ్రేడ్ సుందరయ్య అని సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ కొనియాడారు. సోమవారం వర్ని మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సుందరయ్య 40వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కార్యకర్తలు నివాళులు అర్పించారు. సుందరయ్య జీవితం పార్టీ కార్యకర్తలకు నేటి యువతకు ఆదర్శనీయమని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని నన్నేసాబ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, సాయిలు, సురేష్, మారయ్య, సంజయ్, పీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి

నవీపేట: మండల కేంద్రంలో సోమవారం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా అనగాళపాడు గ్రామంలో జన్మించిన ఆయన 1964సంవత్సరంలో జాతీయ సీపీఎం కార్యదర్శిగా ఎన్నికయ్యాడని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నాయక్‌వాడి శ్రీనివాస్, దేవేందర్ సింగ్, మహబూబ్, వసంత్, సావిత్రి, తదితరులున్నారు.

నేడు నవీపేట మండలంలో ఎమ్మెల్యే పర్యటన

నవీపేట,మే19(ఆంధ్రజ్యోతి): బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మంగళవారం నవీపేట మండలంలో పర్యటించనున్నారని మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మండలంలోని నాడాపూర్, జన్నేపల్లి, నవీపేట, నాగేపూర్, మద్దెపల్లి గ్రామాలలో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొననున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హజరుకావాలని ఆయన కోరారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

ఆర్మూర్ రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎఫ్ఎం హెచ్ఎంలు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులందరికి మంగళవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రాజ్‌గంగారాం తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని రాంమందిర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి 5 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తార న్నారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు సకాలంలో టెక్స్‌బుక్స్‌తో హాజరు కావాలని కోరారు.

నేటి నుంచి బాల్కొండలో..

బాల్కొండ, మే 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 20వ తేదీనుంచి 24వ తేదీ వరకు ప్రాథమిక స్థాయిలో బోధించే మండలస్థాయిలో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని ఎస్‌జీటీ టీచర్లు, ఎల్ఎఫ్ఎం టీచర్లు ఉన్నత పాఠశాలలో పనిచేసే ఎస్‌జీటీ హాజరు కావాలని ఆయన కోరారు.

అసిస్టెంట్ లైన్‌మన్ కుటుంబానికి పరామర్శ

ఎడపల్లి, మే19(ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజుల క్రితం విధులు నిర్వర్తిస్తుండగా విద్యుదాఘాతం తగిలి మరణించిన ఎడపల్లి గ్రామానికి చెందిన అసిస్టెంట్ లైన్‌మెన్ మహేందర్ కుటుంబ సభ్యులను 327 ఐఎన్‌టీయూసీ యూనియన్ సభ్యులు సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మహేందర్ నివాసానికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, వారి కుటంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, మహేందర్ ఆత్మకు శాంతి కలగాలని కోరారు. పరామర్శించిన వారిలో ఎన్పీడీసీఎల్ కంపనీ వర్కింగ్ ప్రెసిడెంట్ పూదరి గంగాధర్, జిల్లా ప్రెసిడెంట్ వేణుగోపాల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మీరా, గంగాధర్, పవన్, జనార్ధన్, గణేష్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును సందర్శించిన ఎస్ఐ

రెంజల్,మే19(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ సందర్భంగా కందకుర్తి గ్రామ శివారులో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఏర్పాటు చేయడం జరిగిందని రెంజల్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. సోమవారం అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఏర్పాట్లను పరిశీలించి చెక్‌పోస్టు వద్ద ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర నుండి సాటాపూర్ సంతకు అక్రమంగా ఆవులను రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కమ్మర్‌పల్లి , మే 19(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హల్దె శ్రీనివాస్ కుటుంబ సభ్యులను సోమవారం బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. హల్దె శ్రీనివాస్ తల్లి కళావతి ఇటీవల మృతిచెందడంతో ఆయనను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, మైలారం సుధాకర్, బద్దం రాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

సుందరయ్య స్ఫూర్తితో భూమి,భుక్తి కోసం పోరాటాలు చేయాలి : సీపీఎం

భిక్కనూరు, మే 19(ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ఆయన ఆశయ సాధన కోసం భూమి, భుక్తి కోసం పోరాటాలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు కొత్త నర్సింలు, నాయకులు ప్రవీణ్, నర్సవ్వ, బాబ్జాన్, హన్మండ్లు, శ్యామల, సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కందకుర్తిలో ప్రారంభమైన శత చండీయాగం

రెంజల్,మే19(ఆంధ్రజ్యోతి): కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రం నందు సోమవారం శత చండీయాగాన్ని కందకుర్తి ఆశ్రమ వ్యవస్థాపకులు సీతారాం త్యాగి మహరాజ్ ప్రారంభించారు. పవిత్రమైన త్రివేణి సంగమ క్షేత్రం నందు తొమ్మిది రోజుల పాటు శత చండీ యాగం, భగవాత్ సప్తాహ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, ఇట్టి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, యోగేష్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.



అయోధ్య స్వామీజీలకు స్వాగతం పలుకుతున్న సీతారాం త్యాగి మహరాజ్

వెలవెలబోతున్న రైతు వేదికలు

● కర్షకులకు అందని సలహాలు, సూచనలు ● అరకొర సౌకర్యాలతో నానా అవస్థలు ● పట్టించుకోని అధికారులు



మెండోరలోని రైతు వేదిక



మెండోరలో ఫంక్షన్ హాలులో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

మెండోర, మే 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు వ్యవసాయశాఖ పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే గతంలో రైతు వేదికలను నిర్మించారు. వీటిలో వ్యవసాయాధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి సలహాలు, సూచనలు అందించారు. గత ప్రభుత్వం ఐదువేల ఎకరాలకు ఒక రైతువేదికను నిర్మించి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసింది. అందులో ఏఈవోలు మాత్రం పంటల వివరాల సేకరణకే పరిమితం అవుతున్నారు. దీంతో రైతులకు పంటల సాగులో మెలకువలు అర్థం కాకపోవడంతో తీవ్రంగా నష్టపోతు న్నారు. సంబంధిత అధికారులు రైతువేదికలో రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాల్సింది పోయి ఫంక్షన్‌హాల్‌లు, సంఘ భవనాలు, బస్టాండ్ ప్రాంతాల్లో చెట్ల కింద సమావేశాలు ఏర్పాటు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో మూడు రైతు వేదికలు

మెండోర మండలంలో మూడు రైతువేదికలను నిర్మించారు. మెండోరతో పాటు బుస్సాపూర్, వెల్కటూర్ గ్రామాలలో ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో 6628 రైతులకు దాదాపు 12772 ఎకరాల సాగు భూములున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఏఈవోల ద్వారా సలహాలు, సూచనలు అందించిన ప్పటికీ ప్రస్తుతం రైతులకు ఎలాంటి సమావేశాలు నిర్వహించడం లేదు.

మద్యం ప్రియులకు అడ్డాగా రైతు వేదికలు

రైతు వేదికలు నేడు మద్యం ప్రియులకు అడ్డాగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు వేదికలకు తలుపులు విరిగిపోవడంతో మద్యం ప్రియులు రాత్రివేలలో మద్యం సేవిస్తున్నారు. అక్కడే మద్యం ప్రియులు నానా హంగామా చేస్తున్నారు. కొన్ని చోట్ల రైతువేదికలు పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. రైతు వేదికలు నిర్మించి ఏడాదికాకముందే ఎక్కడిక్కడే విరిగిపోయాయి. పైకప్పు రేకులు లేచిపోయాయి. రైతు వేదికలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగకముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కనీస సౌకర్యాల కరువు

గత ప్రభుత్వం రైతువేదికను నిర్మిస్తే వాటిలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తాగడానికి మంచినీరు లేని పరిస్థితి. రైతువేదికల వద్ద మిషన్ భగీరథ కనెక్షన్ ఇచ్చినప్పటికి నీరు సక్రమంగా రావడం లేదు. రైతు వేదికల్లో స్వీపర్లు లేకపోవడంతో దుమ్ము, దూళితో దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల ఏఈవోలే సొంత నిధులతో శుభ్రం చేయిస్తున్నారు. అప్పటి ప్రభుత్వం హడావుడిగా నిర్మాణాలు పూర్తి చేసి అరకొర వసతులు కల్పించడంతో నేడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు ప్రతీ రైతు వేదికలో సౌకర్యాల కల్పనకు కృషి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

సలహాలు సూచనలు లేక నష్టపోతున్నాం

● ముస్కు సంతోష్‌రెడ్డి , రైతు వెల్కటూర్



ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా సాగుచేసిన పంటలపై దిగుబడి ప్రభావం పడుతుంది. దీంతో సలహాలు, సూచనలు లేక నష్టపోతున్నాం. అప్పులు తెచ్చి పంటలు సాగుచేస్తే సలహాలు అందడం లేదు. ఏ పంటలు వేస్తే బాగుంటాయే తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతు వేదికలలో రైతులకు సలహాలు సూచనలు అందించాలి.

రైతులకు సలహాలు ఇవ్వడం అధికారులు మరిచారు

● మిట్టపల్లి సాయారెడ్డి, రైతు, మెండోర



రైతులకు సలహాలు సూచనలు ఇవ్వడం వ్యవసాయాధికారులు మరిచారు. క్షేత్రస్థాయిలో ఉన్న తాధికారుల పర్యావేక్షణ లేకపోవడంతో కేవలం పంట నమోదుకు ఏఈవోలు పరిమితమయ్యారు. దీంతో రైతులు నష్టపోతున్నారు. గత ప్రభుత్వం రైతులకు సమావేశాలు నిర్వహించి సూచనలు ఇచ్చింది. ప్రస్తుత ప్రభుత్వంలో అది లోపించింది. అధికారులు స్పందించి రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలి.

పుట్ట గొడుగుల్లా ఇటుక బట్టీలు

● ఎల్లారెడ్డి మండలంలో యథేచ్ఛగా ఇటుక బట్టీల నిర్వహణ ● నిబంధనలకు తిలోదకాలు ● గ్రామాలకు అతి సమీపంలో రోడ్డు పక్కనే బట్టీలు ● కన్నెత్తి చూడని అధికారులు ● ప్రభుత్వ ఆదాయానికి గండి





ఎల్లారెడ్డి - కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన ఇటుక బట్టీలు



బట్టీల వద్ద వేసిన కలప

ఎల్లారెడ్డి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని వివిధ గ్రామాల్లో అనుమతులు లేని ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఇటుక బట్టీలను, గ్రామాలకు అతి సమీపంలోనే కాకుం డా ఎల్లారెడ్డి - కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన నిర్వహించడం గమనార్హం. బట్టీల నిర్వహణతో సమీప గ్రామాలలోని ప్రజలకు రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బంది అధికంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా బట్టీలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. గ్రామాల్లో పలుకుబడి ఉన్న కొంత మందిని మచ్చిక చేసుకోవడం వారి అండదండలతో ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్న అటువైపు అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు.

● నిబంధనలకు విరుద్ధంగా..

ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కిన బట్టీల నిర్వాహకులు ఇష్టానుసారంగా గ్రామాల అతి సమీపంలో నిర్వహిస్తున్నారు. అడవుల నుంచి యథేచ్ఛగా కలపని తరలించడం, చెరువుల నుంచి మట్టిని అక్రమంగా తరలించి బట్టీలు నిర్వహిస్తున్నారు. గ్రామాలకు అతి సమీపంలో బట్టీలు కాలుస్తున్న సమయాన వచ్చే పొగతో ప్రజలు నానా రకాల ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బట్టీలను కాల్చడానికి కలపను తరలించడం తో అడవులు అంత రించిపోయే ప్రమాదం ఉంది. దీంతో భవిష్యత్తులో ఈ పర్యావరణానికి అటు ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఎల్లారెడ్డి - కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన లక్ష్మాపూర్ గ్రామ సమీ పాన రోడ్డు పక్కనే బట్టిల నిర్వహణ కొనసాగుతోంది. బట్టీల నిర్వాహ కులు నిబంధనలకు విరుద్ధంగా అధికారులకు మామూళ్ళు ఇచ్చి తమ పని కాని చేస్తున్నారని ఆరోపణ వ్యక్తం అవుతున్నాయి.

● పట్టించుకోని అధికారులు

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాలకు అతి సమీపంలోని ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రధాన రహదారి పక్కనే బట్టీలు ఉన్న అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. కాలుష్యం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్న ఏ మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం గ్రామాల్లో నిత్యం సందర్శించే ఆయా గ్రామాల కార్యదర్శులు కూడా రెవెన్యూ అధికారులు సైతం అటు వైపు వెళ్లకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటో వారికే తెలియాలి. అధికారుల అలసత్వం బట్టిల నిర్వాహకుల అత్యాశతో పంచాయతీల ఆదాయానికి గండి పడుతుందనేది జగమెరిగిన సత్యం, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అక్రమ ఇటుక బట్టీలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● ఇటుక బట్టీలకు నిబంధనలు

ఎక్కడైనా ఇటుక బట్టీలు నిర్వహించాలంటే ముందుగా సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శుల నుంచి నిర్వహణకు సంబంధించిన అనుమతి పత్రం తీసుకోవాలి. అది కూడా కార్యదర్శి క్షేత్రస్థాయికి వెళ్లి బట్టి నిర్వహణ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేదని ధృవీకరించిన తరువాతనే అనుమతి మంజూరు చేయాలి. అప్పుడు కొన్ని శరతులతో కూడిన అనుమతితో బట్టీలు నిర్వహించుకోవచ్చు. అదేవిధంగా బట్టీలను కాల్చడానికి ఉపయోగించే కల్పకు సంబంధించిన అటవీ శాఖ అధికారులు అనుమతి ఇవ్వాలి. విద్యుత్‌ను వాడుకోవడానికి విద్యుత్ శాఖ అనుమతి, మట్టి తోలు కునేందుకు మైనింగ్ శాఖ నుంచి అనుమతి, భూమి, నాలా కన్వర్షన్ తప్పనిసరిగా ఉండాలి. బట్టీలు కూడా గ్రామానికి దూరంగా జన సంచారం ఎక్కువగా లేని ప్రాంతాలలో పరిమితి దూరంలో నిర్వహించుకోవాలి.



ఎంజే హాస్పిటల్ వెళ్లే దారిలో ప్రమాదకరంగా మూల మలుపులు

ప్రమాదకరం.. మూలమలుపులు

పెర్కిట్, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరమైన మూలమలుపులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఎంజే హస్పిటర్ వెళ్లే దారిలో మలుపులతో కూడిన దారిలో ప్రయాణించడం వాహనదారులకు నిత్యం ఇబ్బందిగా మారింది. ఈ దారిలో ప్రయాణించే వాహనాలకు మలుపు ఎక్కువగా ఉండటం వల్ల ముందువైపు నుంచి వచ్చే వాహనాలను గుర్తించడం ఇబ్బందిగా మారింది. ఈ దారిలో ప్రయాణించే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. చాలా సందర్భాలలో వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొని గాయాల పాలయ్యారు. ఎంజే హాస్పిటల్‌కి వెళ్లే దారి కావడంతో ఈ దారి గుండా వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. పట్టణంలోని రహ దారిపై ట్రాఫిక్ ఎక్కువ కావడం వల్ల వాహనదారులు పెర్కిట్ చేరుకోవడానికి ఈ దారి గుండా ఎక్కువగా ప్రయాణం చేస్తారు. మూల మలుపు ఎక్కువగా ఉండ డం వల్ల నిత్యం వాహనాలు ప్రమాదాలకు గుర వుతున్నాయని స్థానికులు తెలిపారు. రాత్రి సమయంలో ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటు న్నాయని వెంటనే సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహన దారుల కోరుతున్నారు. అత్య వసరమైన సమయంలో ఆసుపత్రిని చేరుకోవడానికి వెళ్లాల్సిన సందర్భా లలో ప్రయాణించేటప్పుడు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థాని కులు, వాహనదారులు కోరుతున్నారు.

మలుపు ఎక్కువగా ఉండడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు గుర్తించడం కష్టమవుతుంది: రాకేష్, స్థానికుడు

ఈ మార్గంలో మలుపు ఎక్కువగా ఉండటం వల్ల తరచు వాహనాలు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నాము.

బురద రోడ్లు.. అస్తవ్యస్తంగా డ్రైనేజీలు

● ఇబ్బందుల్లో ప్రజలు ● పట్టించుకోని అధికారులు





విద్యానగర్, ఆదర్శనగర్‌లలోని బురదమయమైన రోడ్లు

ఆర్మూర్ రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధి మామిడిపల్లిలోని విద్యానగర్ కాలనీ, ఆదర్శనగర్ కాలనీలు ఏర్పాటై 15 సంవత్సరాలు గడుస్తున్నా మౌళిక వసతులు కరువయ్యాయి. రోడ్లు బురద మయంగా మారి రాకపోకలకు, నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. విద్యానగర్ కాలనీలో డ్రైనేజీలలో సాఫీగా వెళ్లాల్సిన మరికి నీరు రోడ్లపైకి పారి బురదమయంగా తయారవుతున్నాయి. గతంలో నిర్మించిన డ్రైనేజీలు లోతుగా ఉండడం, నూతనంగా నిర్మించిన రోడ్లు ఎత్తులో ఉండడంతో డ్రైనేజీలో మురికి నీరు చెత్తచెదారంతో నిండి రోడ్లపైకి వస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో నిత్యం బురదతో కూడుకున్న రోడ్లపై నుంచే వెళ్లాల్సి వస్తుందని వారు వాపోతున్నారు.

ఆదర్శనగర్‌లో సమస్యలు అనేకం

మామిడిపల్లి శివారులోని మరో కాలనీ ఆదర్శనగర్. ఈ కాలనీలో సమస్యలకు కొదువలేదు. ఏళ్ల క్రితం ఏర్పాటైన ఈ కాలనీలో సరైన రోడ్లు లేకపోవడం కాలనీవాసులను ఆందోళనకు గురిచేస్తుంది. ఆదర్శనగర్‌లోని ఐదో వీధి క్రాస్ రోడ్డు నుంచి మామిడిపల్లి గ్రామలోని హనుమాన్ ఆలయం వరకు బీటీ రోడ్డు వేయాల్సి ఉంది. ఆ కాలనీ సమీపంలోని హనుమాన్ ఆలయం వరకు బీటీ రోడ్డు నిర్మిస్తే కాలనీవాసులకు సౌకర్యంగా ఉండేది. ఆ స్థలంలో గతంలో వేసిన సీసీరోడ్డు ఉన్నప్పటికీ సీసీ రోడ్డుపై గుంతలమయంగా మారింది. మట్టి పేరుకుపోయి సీసీ రోడ్డు ఆనవాలు లేకుండా పోయింది. నూతనంగా ఇండ్లు నిర్మించుకునేవారు వారి ఇండ్ల పరిధిలో డ్రైనేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో నూతన ఇంటికి వినియోగంచే నీరు మొత్తం రోడ్డుపై నిలిచి బురదమయంగా తయారై స్థానికులకు అసౌకర్యంగా మారింది.

ఇంటిపన్నులు చెల్లిస్తున్నా సమస్యలు తీర్చరా!?

విద్యానగర్, ఆదర్శనగర్‌లలో ఏళ్ల క్రింద ఇండ్లు నిర్మించుకుని నివాసం ఉంటూ ప్రతీ సంవత్సరం సక్రమంగా ఇంటిపన్నులు చెల్లిస్తున్నప్పటికి కాలనీ సమస్యలు మాత్రం తీరడం లేదు. రోడ్లపై బురద ఉండడంతో నిత్యం హనుమాన్ మందిరానికి పూజలు చేయడానికి వెళ్లే భక్తులకు, మహిళలకు అసౌకర్యంగా మారింది. దేవుడి గుడికి కూడా బురదరోడ్డు పై నుంచి వెళ్లాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిస్తే మట్టి రోడ్లతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారంటున్నారు. డ్రైనేజీలలో సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో డ్రైనేజీల వద్ద ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగి డ్రైనేజీలో చెత్తచెదారంతో నిండి ఉంటుంది. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.


చిన్న గ్రామ పంచాయతీల్లో ఎక్కడి సమస్యలు అక్కడే!

● చిన్నపల్లెలకు నిధులు కేటాయించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ● గ్రామాల్లో అనేక సమస్యలు ● ఏళ్లు గడుస్తున్నా మెటల్ రోడ్డే దిక్కు



గ్రామంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు ఇదే

ఫోకస్



జక్కాపూర్ గ్రామ ముఖ చిత్రం



బీటీ రోడ్డు నిర్మాణానికి నోచుకోని జక్కాపూర్ మెటల్ రోడ్డు ఇది

నిజాంసాగర్, మే 19 (ఆంధ్రజ్యోతి): సరిపడ నిధులు లేక చిన్న గ్రామ పంచాయతీల చింత తీరడం లేదు. గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరిపడా నిధులు ఇవ్వడంలో విఫలమయ్యారు. ఎదురులేని చిన్న గ్రామ పంచాయతీకి ఆమడ దూరంలో ఉన్నాయి. 2019లో అప్పటి ప్రభుత్వం చిన్న గ్రామాలను కూడా గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసింది. 1000 జనాభా లేకుండా ఆ గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసింది కానీ ఏళ్ల నుండి మెటల్ రోడ్‌లే ఈ గ్రామానికి దిక్కు. ఈ రహదారిని తార్రోడుగా మార్చేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎలాంటి చొరవ చూపలేకపోతున్నారు. నిజాంసాగర్ మండలం జక్కాపూర్ గ్రామంలో 779 జనాభా కలిగి ఉంది. ఈ గ్రామాన్ని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. అప్పట్లో ఈ గ్రామ పంచాయతీకి ఎన్నికలు నిర్వహించకుండా గ్రామస్థులు ఏకగ్రీవంగా సర్పంచ్ ఎన్నుకున్నారు. గ్రామానికి సరిపడా తాగునీరు దొరకటం లేదు. ఉదయం పూట మిషన్ భగీరథ నీరు వస్తున్నప్పటికీ సాయంత్రం వేళ బల్క్ నీరు సరఫరా చేస్తూ ఉన్నారు. ఈ గ్రామంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న పరిష్కారం చేసే నాథుడే కరువయ్యారు. ఈ గ్రామంలో భూగర్భ జలాలు కరిగిపోవడంతో త్రాగునీటి సమస్య తలెత్తింది. గ్రామంలో ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాల ఉంది. పాఠశాలకు సరిపడా గదులు లేకపోవడంతో అరకొర వసతుల మధ్యన పాఠశాల కొనసాగుతూనే ఉంది. గ్రామానికి 15వ సంఘం ఆర్థిక నిధులు 68 వేల రూపాయలు వస్తున్నప్పటికీ గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుధ్య కార్మికులకు జీతాలు కే సరిపడలేదు. గ్రామంలో 201 ఇండ్లు ఉన్నప్పటికీ ప్రతి సంవత్సరం ఇండ్ల టాక్స్ 69 వేల ఐదు వందల రూపాయలు వసూలు చేయడం జరుగుతుంది. ప్రత్యేక నిధులు లేకపోవడంతో అభివృద్ధికి నోచుకోవటం లేదు. గ్రామం నుండి జాతీయ రహదారికి వెళ్లేందుకు మెటల్ రోడ్డు ఉన్నప్పటికీ బీటీ రోడ్ల మార్చలేక పోవడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్న గ్రామ పంచాయతీలకు గ్రామ పంచాయతీ కార్యాలయం కూడా నిర్మాణం చేపట్టలేకపోయారు. ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు చేసిన పాలకులు గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని చేపట్టలేకపోయారు. గ్రామ పొలిములలో ఉన్న వన నర్సరీ కూడా నీటి కొరత ఏర్పడడంతో గ్రామ సమీపంలో ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న బోర్ బావి నుంచి నీటిని మొక్కలను వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిన్న గ్రామంలో పంచాయతీలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి ..



గ్రామంలో భూగర్భ జలాలు తరిగిపోయాయి. దీంతో తాగునీటి సమస్య తలెత్తుతుంది. చిన్న గ్రామపంచాయతీకి నిర్వహణకు నిధులు సరి పడలేదు. గ్రామం నుండి నరసింగ రావుపల్లి చౌరస్తాకు వెళ్లే ప్రధాన రహదారి బీటీ రోడ్ నిర్మాణం లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తే చిన్న గ్రామ పంచాయతీలు అభి వృద్ధి దిశలో పయనిస్తాయి. - హరీష్‌గౌడ్, పంచాయితీ సెక్రటరీ



పల్లె చెరువులో అతిథి పక్షుల సందడి

వేసవి కాలం ముగింపు దశకు చేరుతుండటంతో పల్లెల్లోని వందల కొంగలు ఒకేసారి చెరువులో దిగి చేపల కోసం వేట కొనసాగిస్తుండటంతో చెరువులు సందడిగా మారాయి. ● (ఆంధ్రజ్యోతి, పెద్ద కొడప్‌గల్)

CLASSIFIEDS

PASSPORT LOST

I, SHAIK AFROZ S/O SHAIK NIZAM (V)&MANDAL: DONKESHWAR, DIST: NIZAMABAD, T.G, HAVE LOST MY PASSPORT. MY ORIGINAL PASSPORT (PASSPORT NUMBER V5194189) WHILE TRAVELING FROM NANDIPET TO NIZAMABAD ON BUS IF FOUND PLEASE CONTACT : 7396079146

AJZ

Classifieds

మీ అభిమాన ఆంధ్రజ్యోతి దినపత్రిక కల్పిస్తోంది ఒక చక్కటి అవకాశం

ప్రతి రోజు... క్లాసిఫైడ్స్

ప్రతి 4 లైన్లకు 190/- అదనపు లైన్‌కు రూ.45/- GST 5% Extra



పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

-: సంప్రదించవల్సిన నెంబరు :-

నిజామాబాద్: 99484 06282, కామారెడ్డి : 9985411453

కన్నుల పండువగా శ్రీవారి కల్యాణ మహోత్సవం



టీటీడీలో శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బీర్కూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా సోమవారం శ్రీవారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వచించారు. పలు జంటలు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని కళ్యాణం జరిపించారు. స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శ్రీవారి కళ్యాణం వైభవంగా జరిగింది. కళ్యాణ ఘట్టాన్ని భక్తులు ప్రత్యక్షంగా వీక్షించి తరించారు. అనంతరం స్వామివారికి పల్లకి సేవ నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అప్పా రావు, నరసరాజు, సత్యనారాయణ, మురళీ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

టీబీ లక్షణాలు ఉంటే వైద్యాధికారుల సలహాలు పాటించాలి

● రామారెడ్డి వైద్యాధికారి డాక్టర్ సురేష్



టీబీ ముక్త్ భారత్‌ను ప్రారంభించిన వైద్యాధికారి డాక్టర్ సురేష్

రామారెడ్డి, మే 19 (ఆంధ్రజ్యోతి):టీబీ లక్షణాలు ఉంటే వైద్య వైద్యాధికారుల సలహాలు పాటించి మందులు సక్రమంగా వాడాలని రామారెడ్డి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సురేష్ పేర్కొన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలోని ఆసుపత్రిలో టీబీ వందరోజుల పాటు ముక్త్ భారత్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నామని డాక్టర్ సురేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరైన విధంగా మందులు సక్రమంగా పాటించి రోగాలను దూరం చేసుకోవాలని.. వైద్యులు పలువు సలహాలు, సూచనలు, పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సూపర్వైజర్ జానకి, ల్యాబ్ టెక్నీషియన్ పవన్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేటలో ఘనంగా పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్

నాగిరెడ్డిపేట, మే 19 (ఆంధ్రజ్యోతి):నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో సోమవారం పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నాగిరెడ్డిపేట ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి నూతన ఆలయాన్ని నిర్మించారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో పాటు ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, ఎల్లారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ కుడు ముల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసి సామెల్, స్థానిక మండల మాజీ జడ్పీటీసి జయరాజ్, మండల నాయకులు బోయిని విఠల్, రాజిరెడ్డి, హన్మం త్ రెడ్డి, కిష్టయ్య, వంశీకృష్ణ గౌడ్, లక్ష్మీకాంతం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అనుమతులు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం



సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

బాన్సువాడటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా బాన్సువాడ పట్టణంలో అడ్మిషన్లు నిర్వహిస్తున్న శ్రీ చైతన్య విద్యా సంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పట్టణంలో శ్రీ చైతన్య పాఠశాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్లు చేస్తున్నారని, అలాంటి పాఠశాలపై అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని , లేని పక్షంలో ఎల్ఎస్ఓ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అంతేకాకుండా డీఈవో కార్యాలయ ముట్టడి చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఓ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు జీవన్, ఎస్ఎఫ్ఐ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు అజయ్ , ఏఐఎస్ఎఫ్ బాన్సువాడ కన్వీనర్ వంశీ తదితరులున్నారు.

ఘనంగా హనుమాన్ సాయి ఆలయ వార్షికోత్సవం



బాన్సువాడలో ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న పోచారం



ఇబ్రహీంపేట్‌లో విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న పోచారం, కాసుల

బాన్సువాడటౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్కి చెరవు కట్టపై గల శ్రీ హనుమాన్ సాయి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలోని సాయిబాబా మూలవిరాట్టుకు భక్తులు అభిషేకాలు , అర్చనలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని బాబాను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారు , బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి , రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యులు మధ్యాహ్నం భక్తుల కోసం అన్నప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కాపర్తి సంగమేశ్వర్ , లక్ష్మణ్ , సుధాకర్ , నాయకులు , తదితరులున్నారు.

ఇబ్రహీంపేట్‌లో:మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో సోమవారం జరిగిన శ్రీ వీరాంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ సలహాదారు , బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి , రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామస్థులు వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు , నాయకులు తదితరులున్నారు.

బాన్సువాడటౌన్: బాన్సువాడ పట్టణంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ షేక్ జుబేర్ కూతురు వివాహ వేడుకల్లో ప్రభుత్వ సలహాదారు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్, బీఆర్ఎస్ బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి , మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్దన్ , గంపగోవర్దన్, జాజాల సురేందర్ , హన్మంత్‌షిందే, మాజీ జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, మాజీ జెడ్పీ చైర్మెన్ దఫేదార్ రాజులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

విపత్తు నిర్వహణ మాక్ డ్రిల్‌లో అధికారులు పాల్గొనాలి

● కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డిటౌన్,మే 19(ఆంధ్రజ్యోతి):వర్షాకాలంలో వచ్చే విపత్తులు, వరదల వలన ప్రజలను అప్రమత్తం చేయడానికి ఎన్‌డీఆర్ఎఫ్ మాక్ డ్రిల్‌లో సంబంధిత యంత్రాంగం పాల్గొనాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో పోలీసు,రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్,విద్యుత్, రోడ్డుభవనాలశాఖాధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవ నాలు, సంఘటనల ఆధారంగా జిల్లాలో వరదల నేపథ్యంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలించడం,అప్రమత్తం చేయడం వంటి కార్యక్రమాలను ప్రత్యేకంగా మాక్ డ్రిల్ ద్వారా మంగళవారం కామారెడ్డి పట్టణంలోని జీఆర్‌కాలనీ, జీవదాన్ ప్రాంతాలలో ఎన్‌డీఆర్ఎఫ్‌చే నిర్వహించే కార్యక్రమానికి సంబంధిత అధికారులు పాల్గొనాలని తెలిపారు.అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు,వరదలు సంభవించినప్పుడు ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, డీయంహెచ్‌వో చంద్రశేఖర్, విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్, రోడ్డుభవనాలశాఖ ఈఈ రవిశంకర్, డీపీఓ మురళి,జిల్లా అగ్నిమాపకశాఖాధికారి సుధాకర్, మున్సిపల్ కమీషనర్‌లు రాజేందర్,శ్రీహరి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

● **రాజీవ్ యువవికాసం దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి**

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం అధికారులతో తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్‌కు సంబంధించిన 41,547 దరఖాస్తులను బ్యాంకులకు పరిశీలనకు పంపగా వాటిలో 15,515 దరకాస్తులు బ్యాంకర్లు పరిశీలించినట్లు తెలిపారు. మిగితావి రెండురోజుల్లో పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత అధికారులు బ్యాంకులనుండి సమాచారం త్వరగా తీసుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, డీఆర్‌డీఓ పీడీ సురేందర్,బీసీ సంక్షేమాధికారి స్రవంతి, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

కొడుకును చంపిన తండ్రి

● కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్‌లో ఘటన



రోదిస్తున్న మృతుడి తల్లి సర్పవ్వ, బంధువులు, ఇన్‌సెట్‌లో నిఖిల్(ఫైల్)

కామారెడ్డి టౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): దుర్వ్యసనాలకు బానిసైన కొడుకు నిత్యం వేధిస్తుండడంతో.. విసుగు చెందిన కన్న తండ్రే దారుణంగా హత్య చేసిన ఘటన కామారెడ్డి జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ గ్రామానికి చెందిన వడ్ల నిఖిల్ (24)ఉపాధి నిమిత్తం ఏడాది క్రితం గల్ఫ్‌కు వెళ్లాడు. అక్కడ పని సరిగ్గా లేకపోవడంతో.. మూడు నెలల క్రితం స్వగ్రామానికి తిరిగొచ్చాడు.అప్పటి నుంచి మత్తు పదార్థాలకు బానిసగా మారాడు. దీంతో తనకు డబ్బులు ఇవ్వాలంటూ ప్రతీరోజు తల్లిదండ్రులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం కూడా తనకు డబ్బులు ఇవ్వాలని తండ్రి భాస్కర్‌తో గొడవ పడ్డాడు. కోపోద్రిక్తుడైన తండ్రి భాస్కర్ పక్కనే ఉన్న ఇనుపరాడుతో నిఖిల్ తలపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబీకులు అతన్ని వెంటనే కామారెడ్డిలోని ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో నిఖిల్ మృతి చెందాడు. ఈ మేరకు దేవునిపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మందలించిన తండ్రి.. యువకుడి ఆత్మహత్య



రాకేష్ మృత దేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

నిజాంసాగర్,మే 19 (ఆంధ్ర జ్యోతి): కన్న తండ్రి సెల్‌ఫోన్ ఎక్కువగా మాట్లాడుతున్నావ్ అంటూ మంద లించినందుకు తనయుడు మనస్తాపం చెంది ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజాంసాగర్ మండలం చిన్నాఆరేపల్లి గ్రామంలో కొంకుల గంగారం తనయుడు కొంకుల రాకేష్ (20) సంవత్సరాలు ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని సోమవారం మృతి చెందాడు. నిజాంసాగర్ ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివ రాలు ఇలా ఉన్నాయి. కొంకల రాకేష్ ఊర్లోనే ఉంటూ వ్యవసాయం చేస్తూ ఉండేవాడని, తల్లిదండ్రులు హైదరాబాద్ బతుకు జట్కు కోసం వలస వెళ్లి నట్లు ఆయన వెల్లడించారు. కొంకుల రాకేష్ ఊర్లోనే ఉండేవాడని తరచుగా రాకేష్ సెల్ఫోన్లో మాట్లాడుతూ ఉండడంతో తండ్రి బెదిరించారని ఆయన తెలిపారు. తండ్రి బెదిరింపులకు మనస్తాపం చెంది ఉరి వేసుకున్నట్లు ఆయన తెలిపారు. తండ్రి గంగారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాన్సువాడ తరలించినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

బీబీపేటలో ఒకరి అనుమానాస్పద మృతి

బీబీపేట, మే 19(ఆంధ్రజ్యోతి): బీబీపేట మండల మాజీ వార్డు మెంబర్ భర్త వేముల పరశరాములు అనుమానాస్పద మృతిచెందాడు. గత కొన్నిరోజుల క్రితం పరశరాములు ఇంటినుంచి వెళ్లి కనిపించ కుండా పోయాడు. దీంతో కుటుంబీకులు,బంధువులు పలుచోట్ల వెతికి అతనికోసం వాట్సాప్ గ్రూపులలో అతని కోసం ప్రకటనలు ఇచ్చారు. ఆదివారం మధ్యాహ్నం మృతుని అన్న శ్రీనివాస్‌కు అల్వాల్ పోలీసు స్టేషన్ నుంచి తన సోదరుడు పరశురాములు చనిపోయాడని ఫోన్ వచ్చింది. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు అనుమానస్పద కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భవానిపేటలో విద్యుదాఘాతంతో గేదె మృతి

లింగంపేట, మే 19 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలోని భవానిపేటలో సోమవారం విద్యుదాఘాతంతో పిన్నూరి లక్ష్మన్‌కు చెందిన గేదె మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామ శివారులో బోరుమోటరుకు బిగించిన విద్యుత్ సర్వీస్ తీగలు గాలికి కిందపడడంతో అటుగా మేతకు వెళ్లిన గేదెకు విద్యుత్ తీగలు తగిలి గేదె విద్యుదాఘాతంతో మృతి చెందనట్లు వారు తెలిపారు. గేదె విలువ రూ.45000ఉంటుందని వారు తెలియజేశారు. ప్రభుత్వం రైతును ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఎల్లారెడ్డిలో ఒకరి అదృశ్యం

ఎల్లారెడ్డి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన గుసక సిద్ధిరాములు ఈనెల 17న ఉదయం కూలీ పనిచేయడానికి వెళ్తున్నాను అని ఇంట్లో చెప్పి తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని ఆచూకీ కొరకు భార్య కుటుంబ సభ్యులు చుట్టుపక్కల బంధువుల వద్ద వెతకగా. ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో భార్య దుర్గ వేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



నసురుల్లాబాద్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై అరుణ్ కుమార్

నసురుల్లాబాద్, మే 19(ఆంధ్రజ్యోతి): నసరుల్లాబాద్ మండల కేంద్రంలోని బొమ్మన్‌దేవ్‌పల్లి ఎక్స్ రోడ్ వద్ద సోమవారం నసురు ల్లాబాద్ ఎస్సై అరుణ్ కుమార్ వాహనాలను తనిఖీ చేశారు.. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... ద్విచక్ర వాహనదారులు మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడపరాదన్నారు.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, లైసెన్స్,వెహికల్ ధ్రువ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు..ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గాలివానతో కూలిన నివాస గృహాలు



కూలిన ఇళ్లను పరిశీలిస్తున్న ఆర్ఐ పండరి

మహమ్మద్‌నగర్,మే19(ఆంధ్రజ్యోతి):మహమ్మద్‌నగర్ మండలం గిర్ని తండా గ్రామపంచాయతీ పరిధిలో నడిమితండాలో ఆరుగురి నివాస గృహాలు గాలివానతో కూలాయి.దీంతో మహమ్మద్‌నగర్ ఆర్ఐ పండరి కదవాత్ మీనా, దారావత్ చందర్, కదవత్ లక్ష్మీ, కదవత్ బులిబాయి, కద వత్ మోతిలాల్,కదవాత్ కిషన్‌ల ఇండ్లను పరిశీలించారు. పూర్తిగా నష్టపోయిన లబ్దిదారుల వివరాలు తెలుసుకుని నివేదికను ఉన్నతాధికారు లకు అందజేస్తున్నట్లు తెలిపారు.

బీర్కూర్‌లో అఖండ హరినామ సప్తాహ

బీర్కూర్, మే 19 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌక్ హనుమాన్ ఆలయ సన్నిధిలో సోమవారం అఖండ హరి నామ సప్తాహ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ఈనలె 19వ తేది నుంచి 26వ తేది వరకు వారం రోజుల పాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. వార్కారీలు కీర్తనలు పాడుతూ భక్తులను భక్తి పారవ శ్యంలో ముంచెత్తారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు గాత భజన, సాయంత్రం 5గంటల నుంచి 6 గంటల వరకు ప్రవచనం, రాత్రి 7గంటల నుంచి 8 గంటల వరకు హరిపాఠ్, రాత్రి 9 గంటల నుంచి 11 గంటల వరకు కీర్తన,అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉద యం 4 గంటల వరకు హరిజాగర్, 4 గంటల నుంచి 6 గంటల వరకు కాకడ హారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 25న దిండి ఊరేగింపు, 26న కీర్తన మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వార్కారీలు కోరారు.

స్థానికంగా ఉండి ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలి: ఎంపీవో

నసురుల్లాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి):పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఎంపీవో వెంకటరమణ అన్నారు.సోమవారం మండలంలోని నెమలి గ్రామంలో గల పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీలో గల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక శ్రద్ధ తీసు కోవాలని పంచాయతీ కార్యదర్శి హనుమవ్వను సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి హనుమవ్వ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదులు నిల్

నసురుల్లాబాద్, మే 19(ఆంధ్రజ్యోతి): నసుల్లాబాద్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు రాలేదని తాహసిల్దార్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

వివాహ వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యేలు

గాంధారి, మే 19(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని మారుతీ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వివాహ వేడుకల్లో సోమవారం నిజామాబాద్ రూ రల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్దన్, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరై నూతన వ..ధూవరులను ఆశీర్వదించారు.వారికి స్థానిక బీఆర్ఎస్ నాయకులు స్వాగతం పలికారు.

త్వరలో లక్కీడ్రా ద్వారా డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల ఎంపిక

ఎల్లారెడ్డి, మే 19 (ఆంధ్రజ్యోతి): త్వరలో లక్కీ డ్రా ద్వారా లబ్ధి దారుల ఎంపిక పూర్తి చేసి డబులో బెడ్ రూమ్ ఇండ్లను అందజేస్తామని సోమవారం ఎల్లారెడ్డి తహసీల్దార్ ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి పట్టణ పరిధిలోని సోమర్ పెట్ రోడ్డు పక్కన నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను గతంలో లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయగా ఇటీవల లబ్దిదారులకు ఇండ్లను అందచేశామని. మిగతా 40 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కొరకు ఎక్కువ మంది లబ్ధిదారలు దరఖాస్తు చేసుకున్నారని, అందువల్ల ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు అర్హుల ఎంపిక త్వరలో లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్దిదారులకు అందజేస్తామని సోమవారం పేర్కొన్నారు.

'నెరవేరుతున్న పేదల సొంతింటి కల'

రామారెడ్డి, మే 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినటువంటి పేదోడిసొంతింటి కల నెరవేర్చడంలో భాగంగా ఇందిరమ్మ ఇండ్లు నిజమైన లబ్ధిదారులకు అందించిందని కాంగ్రెస్ నాయకులు, విండో సొసైటీ డైరెక్టర్ స్వామి గౌడ్ పేర్కొన్నారు. రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల అందరికీ ముగ్గు వేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సాగర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మైసాగౌడ్, మహ్మద్ సల్మాన్, యువజన కాంగ్రెస్ నాయకులు దయానంద్, గ్రామ ప్రధాన కార్యదర్శి కూడలి ఎల్లం, నాయకులు షాదుల్, దేవదాసు, కూడలి స్వామి, వీరబోయిన సత్యం, లక్ష్మణ్, వంచ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రథాలకు గేట్లు ఏర్పాటు

రామారెడ్డి,మే 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి, శ్రీపార్వతి రాజరాజేశ్వర స్వామి ఆలయాల రథాలకు గేట్లు ఏర్పాటు చేశారు. సోమవారం చౌరస్తా వద్ద అంగరంగ వైభవంగా పంతులతో పూజలు చేయించి రెండు రథాలకు గేట్లను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ చైర్మెన్ రంగు రవీందర్ గౌడ్, రెండు రథాలకు గేట్ల దాత నర్సింలు,రాజకీయ నాయకులు,యువకులు, భక్తులు పాల్గొన్నారు.

పోసానిపేట్‌లో విగ్రహాలకు ప్రత్యేక పూజలు

రామారెడ్డి, మే 19 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలో ఐదు విగ్రహాల కోసం ప్రత్యేక పూజలు పూజలు చేశారు. సోమవారం పురోహితులతో యజ్ఞం చేసి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ నారెడ్డి దశరత్ రెడ్డి, కాంగ్రెస్ మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామల శీలాసాగర్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, పోసానిపేట్ మాజీ సర్పంచ్ గీరెడ్డి మహేందర్ రెడ్డి, నాయకులు తంకర రవి, భాస్కర్ రెడ్డి, రాజిరెడ్డి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల నెరవేరుతుంది



తిమ్మారెడ్డిలో భూమి పూజ చేస్తున్న నాయకులు



కాటేపల్లిలో ఇండ్ల మార్క్అవుట్‌లను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఎల్లారెడ్డిరూరల్, మే 19(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని తిమారెడ్డి,శివాపూర్ గ్రామాలలో ఎల్లారెడ్డి ఎంపీ డీఓ ప్రకాష్,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కురుమ సాయి బాబాలు ఇందిరమ్మ ఇళ్లమార్క్ అవుట్లను,లబ్దిదారులు వేసిన ముగ్గులను పరిశీలించారు. అనంతరం మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలతో పేదల సొంతింటి కల నెరవేరుతుందన్నారు. విడుతల వారిగా కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందన్నారు. మొదటి ప్రాధాన్యత కలిగిన లబ్దిదారులకు ఇళ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. విడుతల వారిగా అర్హత కలిగిన పేదలందరికి ఇండ్లు మంజూరు ప్రభుత్వం చేస్తుందని తెలిపారు.ఈ కార్య క్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ్,ఇందిరమ్మఇళ్ల కమిటీసభ్యులురాజు, నాగయ్యమదర్,నర్సింలు,ప్రభాకర్‌రెడ్డి,శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్:తెలంగాణ రాష్ట్రంలో గూడు లేని నిరుపేదల కోసమే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతు న్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కాటేపల్లి, జగన్నాథ్‌పల్లి, లింగంపల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణా నికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతు తెలంగాణ రాష్ట్రంలో చాలా మంది పేదలు ఇళ్లు లేక ఉన్నారని, అటువంటి వారి కోసం ఎన్నికల సమయంలో హామి ఇచ్చిన విధంగా ఇందిరమ్మ పేరుతో ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో పేదల కోసం ఇండ్లు నిర్మించి ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం కూడ ఇందిరమ్మ పేరుతో ఒక్కో ఇంటి నిర్మాణా నికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేయడం జరుగుతుం దని తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలలో ఇండ్లు మంజూర యిన లబ్దిదారులు ఇళ్లను త్వరితగతిన నిర్మించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో లక్ష్మి కాంత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చిప్ప మోహన్, మల్లప్ప పటేల్, అక్కలి సాయిరెడ్డి, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - మిషన్ ఇంపాసిబుల్
ప్రియా 70 - ఎలెవన్
ప్రియా 35 - సింగిల్

బాన్సువాడ

మహేశ్వరి - జగదేకవీరుడు అతిలోక సుందరి
వెంకటేశ్వర - మన కుటుంబం

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

